
# అనుబంధం



కె. యస్. యమ్. లక్ష్మి

అది ఎండాకాలం. ఎండ నిప్పులు చెరుగుతోంది. విపరీతమైన రద్దీ. బస్‌లో ఆఫీసు నుంచి ఇంటికొచ్చి కాఫీ కలుపుకుని సోఫాలో కూర్చుని యఫ్.యమ్. రేడియోలో వస్తున్న మధుర గీతాలు వింటున్నాను. అప్పటి పాటలలోని మాధుర్యాన్ని అనుభవించటంలో తన్మయురాలినైపోయాను. టైం ఎంతయిందో గమనించనే లేదు.

ఇంతలో చిన్నబాబు 'తేజ' ఆఫీసు నుంచి వచ్చాడు. లోపలికి వస్తూనే 'అమ్మా! ఇవి చూడు ఎంత బాగున్నాయో' అంటూ తీగలతో అల్లిన ఒక గుండ్రని పంజరాన్ని తెచ్చి నాముందున్న బల్లమీద పెట్టాడు.



తీరా అందులో చూస్తే - వేలెడంత పరిమాణంలో చిన్న చిన్న పక్షులు తొమ్మిది ఉన్నాయి. దగ్గరకు వెళ్లగానే వాటి చిన్న చిన్న గుండ్రని కళ్లని పెద్దవి చేసి మా కేసి చూస్తూ బుట్టలోపల గుండ్రంగా తిరగుతూ పడుతూ లేస్తూ కిచ కిచ శబ్దం చేస్తున్నాయి.

వాటిని చూడగనే ఒక్కసారి అవాక్కయ్యాను. అవి చిన్నవి అంటే మరీ బుల్లివి. కొన్ని గోదుమరంగులో, కొన్ని ముదురు రంగులో నల్ల మచ్చలతో, కొన్ని గుండ్రని చుక్కలలో - బుజ్జి తోకలతో చాలా ముద్దుగా ఉన్నాయి.

ఆ చిన్ని పక్షులను చూస్తుండగానే తేజ - 'అమ్మా! వీటిని ఒక కోయవాడు ఆఫీసుకి తెచ్చి అమ్మాడమ్మా. చాలా బాగున్నాయి - పెంచుకుందామమ్మా. వీటికి చిన్నగింజలు, బియ్యం, నూకలూ - కొంచెం నీళ్లూ చాలమ్మా! అని బ్రతిమాలుతూ - నాకు నచ్చచెప్తున్నాడు.

అయితే నా సమస్యల్లా - నేను, బాబూ ఇద్దరమూ ఆఫీసులకెడితే వీటిని ఎవరు చూస్తారు అన్న సందేహం -

అయినా తప్పదు. ఇది బాబు కోరిక. తనకి కుక్కపిల్లలు, పక్షులూ అంటే చాలా ఇష్టం. గతంలో తను చాలాసార్లు అడగటం - నేనొద్దనడం జరిగింది. ఇక ఈసారి తన మనసు కష్టపెట్టదలచుకోలేదు. వాటిని ఎలాగోలాగు పెంచటానికే సిద్దపడ్డాను.

వెంటనే డ్రాయింగ్ రూమ్‌లో ఉన్న టేబుల్ ఖాళీ చేసి - పైన అంతా న్యూస్ పేపర్లు పరచి బల్ల మధ్యలో ఆ పక్షుల పంజరాన్ని కదలకుండా అమర్చాం ఇద్దరమూ కలసి.

ఆ పంజరంలో ఒక సన్నటి పుల్ల ముక్కకు దారాలు కట్టి ఒక ఉయ్యాల తయారుచేసి అమర్చాం.

ప్లాస్టిక్ మూతలు కొన్ని లోపల అమర్చి వాటికి తాగటానికి నీళ్లు పోసాం.

దొడ్లోని చెట్ల కొమ్మలు ఎండువి తెచ్చి లోపల చెట్టులా పెట్టాం. కొన్ని పచ్చటి కొమ్మలూ అమర్చాం.

వాటికి తిండి కోసం కొన్ని బియ్యం గింజలు గ్రైండర్‌లో నూక చేసి - దానిని ఒక వెడల్పాటి పళ్లెంలో వేసి లోపల పెట్టాం.

కాని ఆ రాత్రంతా - అవి దగ్గర కొచ్చి చూసి - వెనక్కి వెళ్లిపోయాయి కానీ ఆ నూకలు ముట్టుకోలేదు, తినలేదు. అవి గుడ్లు మిటకరించుకుని చూస్తూ ఉండిపోయాయి. సరిగా కళ్లు మూసుకు నిద్రపోనూ లేదు.

నేనూ, బాబూ వాటినీ, వాటి చర్యలనూ చూస్తూ - చాలాసేపు మెలకువగా ఉండి పోయాం.

రాత్రంతా ఆ చిన్న ప్రాణులు నీళ్లు తాగాయే గానీ - తిండి తినలేదు. ప్రాణభయమో - కొత్త ప్రదేశమనోగాని - మౌనంగా కళ్లు తెరచు

కుని అలాగే కూర్చున్నాయి.

తెల్లవారకుండానే వాటి కిచకిచ శబ్దాలతో మమ్మల్ని నిద్ర లేపాయి ఉదయం ఐదు గంటలకే. అప్పటి నుంచే ఆటలు - ఊయల మీద వరుసగా కూర్చుని చూడముచ్చటగా ఊగ సాగాయి.

చిన్న ముక్కులతో ఒకదాన్ని మరొకటి పొడుచుకుంటూ పోట్లాడుకునేవి- వాటి ఆ చర్య లు చూస్తే - అవి వాటి భాషలో మాట్లాడు కుంటున్నాయేమో అనిపించింది.

ఆ రోజు ఆఫీసు నుంచి వచ్చేటపుడు ఆ బుజ్జి పక్షులు తినగల్గినంత చిన్న గింజలు తెచ్చి వాటి పంజరంలోని పళ్లాలలో పోయగానే - ఎంతో సంబరంగా ఒకదాన్నొకటి తోసుకుని - తోసుకుని తినేసాయి. నిముషంలో పళ్లెం ఖాళీ చేసేసాయి.

నాకు వాటికింత తిండి పెట్టగల్గినందుకు కొంచెం మనశ్శాంతిగా ఉంది. కానీ అంతరాంతరాలల్లో ఏదో ఆవేదన... వాటిని తలుచుకుంటే.

ఏ చెట్ల కొమ్మల మీదో ఉంటూ - అడవిలో చల్లని గాలిలో హాయిగా, స్వేచ్ఛగా తిరుగుతూ - వాటి జాతి పక్షుల మధ్య బ్రతకాల్సిన వాటిని - ఇలా పంజరంలో బంధించివేసామేనని చాలా బాధగా ఉండేది.

మనం ఎంత జాగ్రత్తగా - ప్రేమగా చూసుకుంటున్నా - వాటికేదో అన్యాయం జరిగి పోతోందన్న బాధ.

సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చి - ఏం చేస్తున్నాయో అని వాటి దగ్గర కెళ్లి "హాయ్" అని పలకరించగానే ఒక్కసారి అన్నీ కళ్లు పెద్దవి చేసి చూసేవి మా ఇద్దరినీ. పాపం అనిపించేది. అలా నెమ్మదిగా అలవాటుపడ్డాము. అవీ, మేమూ కూడా.


కాని వాటిలో ఒకటి మా దగ్గరకొచ్చినప్పటినుంచీ మిగిలిన వాటితో కలవకుండా విచారంగా ఒకచోట కూర్చుని ఉండేది. ఎప్పుడో గానీ తిండి తినేది కాదు. బాబు తెచ్చినపుడు చెప్పాడు - అమ్మా, దీని జతపక్షి చనిపోయిందట అని. అది దాని తోడుని కోల్పోయిన దుఃఖాన్ని అంతగా అనుభవించటం చూస్తుంటే గుండె తరుక్కుపోయేది. ఒక జంటలోని ఒక తోడు చనిపోతే - పోయిన వారి వల్ల వచ్చే రాబడిపోయిందనో - లేక ఆ వ్యక్తి లోటులో సంపాదించిన ఆస్తిలో వాటా పోతుందనో లేక రాదనో మొదట - తరువాత ఆ వ్యక్తి వల్ల ప్రేమానురాగలు - రక్షణ - తోడు - విలువలు గురించి ఆలోచిస్తారు.

కాలక్రమాన మాత్రమే ఆ వ్యక్తి మిగిల్చిన ఒంటరితనం, వారితో అనుబంధపు విలువలూ గుర్తిస్తారు.

తోడు చనిపోయినా ఏవో కారణాల వల్ల వియోగ దుఃఖాన్ని భరిస్తూనైనా బ్రతకక తప్పదు. లేదా పాత అనుబంధపు స్మృతులు ప్రక్కన పెట్టి మరో తోడుని వెంటనే జత చేసుకుని మిగిలిన జీవితాన్ని గడుపుతారు.

బహుశా సృష్టిలో మానవులకూ - పశు పక్ష్యాదులకూ భగవంతుడు నిర్దేశించిన భేదమదే కావచ్చు లేదా వారి ఇరువురి మధ్య - ప్రేమానురాగాల, అనుబంధాల స్వచ్ఛత కావచ్చు.

కానీ ఆ చిన్ని పక్షికి తను కోల్పోయిన తన జత పక్షిమీద ఎంత గాఢప్రేమ - తన మొదటి తోడు తప్ప మరో తోడుని కోరనూ కోరలేదు. దాని వియోగాన్ని భరించనూలేకపోయింది.




భగవంతుని సృష్టిలోని చిన్న, పెద్ద ప్రాణుల లోనే - ప్రేమానురాగాలలో - ఎంతో తేడా! పక్షులలో సృజించిన ప్రేమ, స్వచ్ఛత మానవులలో మిగలలేదు. ఇది మానవుడు తానుగా సాధించిన ప్రగతి కాబోలు అనిపించింది.

మరో పది రోజులు గడిచాయి - ఒకరోజు తెల్లవారేసరికి ఆ ఒంటరి పక్షి పంజరంలో నిర్జీవమై పడి ఉంది. ఆ దృశ్యం చూస్తూ నా మనస్సంతా బాధతో అల్లకల్లోమైంది.

ఈ చిన్న పక్షి జాతుల్లో 'ప్రేమ' మానవులలో కంటే ఎంత పవిత్రంగా - సజీవంగా, దృఢంగా ఉంది! తన తోడును వీడి - జంటకు దూరమై - ఎన్నో రోజులు బ్రతకలేక - అనంత దూరాలకు పయనమై - తోడును చేరటం - ఆనందం, ఆశ్చర్యం, దుఃఖాన్నీ కల్గించాయి.

మనషుల్లో ప్రేమ ఇంత బలంగా, నిర్మలంగా ఉందా? అన్పించింది.

ఇలా మిగిలిన పక్షులతో మాకూ అనుబంధం ఏర్పడటం - వాటి ముద్దు చేష్టలు చూస్తూ పసిపిల్లల్ని చూస్తున్నంత ఆనందం పొందటం - అవి మా మనసుల్ని దోచుకున్నాయి.

కాని కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదుకదా. అది తెచ్చే మార్పులకు ఎవరిమైనా బలికావల్సిందే. మార్పును స్వీకరించక, మాకైనా తప్పదు.

మరో నెల గడిచేసరికి మిగిలిన వాటిల్లో ఒకటి మరీ నీర్సంగా కూర్చుని తిండి తినటం మానేసింది. క్రమంగా దానికేమి అనారోగ్యమో మరో రెండు రోజులకి అదీ చనిపోయింది.

అలా రెండు పక్షులు దూరమైపోవటం చూసేసరికి - మా ఇద్దరి మనసుల్లో వేదన

పట్టుకుంది.

ప్రేమించే మనస్సుండడం ఒక శాపమేమో అన్పిస్తుంది. మా ప్రేమ, అప్యాయత - మేం పెట్టే తిండీ మాత్రమే వాటికి చాలటం లేదు. వాటికి కావలసింది ఏదో మేము ఇవ్వలేకపోతు న్నాము అన్పించింది.

ప్రతి ప్రాణికీ ఆ దైవం ఒక జీవన విధా నాన్ని, వాటికి కావలసిన అత్యవసరాలనూ - అన్నీ నిర్ణయించి ప్రాణుల్ని సృష్టిస్తాడు. బహుశ అందులో ప్రాణాధారం అతి ముఖ్యమైనదేదో ఉంటుంది. అన్న పానీయాలున్న ప్రాణి కొంత కాలం బ్రతుకుతుంది. కాని జీవనాధారం లేక పోతే బ్రతుకు దుర్భరం అవుతుంది కాబోలు.

చివరకు ఒకరోజున బాబు ఏమాలోచిం చాడో ఏమో - "అమ్మా వీటిని వదిలేద్దాము" అన్నాడు.

వెంటనే ఇంటి తలుపులన్నీ తెరచి ఆరు బయట - ఒక పెద్ద చెట్టు దగ్గరకు పంజరాన్ని తీసుకెళ్లి నెమ్మదిగా తలుపు తెరిచాము.

అత్యంత వేగంగా నీలాకాశంలోకి ఎగిరిపో యాయి పక్షులన్నీ.

అప్పుడు అన్పించింది నాకు - "స్వేచ్ఛ"లో ఉన్న ఆనందం ఎంత విలువైంది. అది ఆ దైవం ప్రతి ప్రాణినీ సృష్టించే సమయంలోనే ఒక వరంలా ప్రసాదిస్తాడు.

మేము ఆ వరాన్ని వాటికి దూరం చేసామే మో. అందుకే ఏ హద్దులూ లేని ఆ ఆనందమయ మైన లోకంలోకి హాయిగా ఎగిరిపోయాయి.

కాని - కొన్ని నెలలు వాటి ఆలనాపాలనా, వాటి అచ్చటా, ముచ్చటా చూడటం వలన మా మనసులు కలతచెందాయి. వాటి చర్యలతో అవి మాకు కల్గించిన ఆనందం కోల్పోయాము. చాలా రోజులు వాటి జ్ఞాపకాలు ఆనందాన్ని, దుఃఖాన్నీ మిగిల్చాయి.

వాటి కిలకిలారావాల మేలుకొలుపులు ఇక వినిపించవు.

సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చీరాగానే పలకరించే చిన్నారి ప్రియనేస్తాలు ఇంక లేరు అనే భావన చాలా రోజుల వరకూ వేధించేది.

ఏ ప్రయాణంలోనైనా పక్షులను అమ్మే షాపులు కనబడగానే 'నా బుజ్జి పక్షులు' గుర్తు కొచ్చి ఆవేదన కలిగేది. అంతలోనే వాటిని బం ధించి వినోదించాలనుకునే మానవుడు ఎంత స్వార్థపరుడు అన్పించేది మానవుడి స్వార్థం, విశ్వరూపం తలచుకుంటే.

దైవం - తన కోసం సృజించిన వాటిని అనుభవిస్తాడు. పుడమి తల్లి ఇచ్చిన పంట తింటున్నాడు. పశువులు వాటి బిడ్డల కోసం ఏర్పరచిన పాలు తాగుతున్నాడు. తినగల్గినన్ని జంతుజాలాన్ని ఆహారంగా తింటున్నాడు. అయి నా తృప్తిలేదు. మానవుడి ఆకలికి, ఆశకూ అంతులేదు.

పాపం - చెట్ల కొమ్మలపై - చెట్ల లేత చిగుళ్లనూ, అల్ప జీవులనూ తిని బ్రతికే - చిన్నా రి పక్షులను - పట్టి బంధించి - పంజరాల్లో పెట్టి, వాటిని అమ్మి - తన పొట్ట నింపుకుంటు న్నాడు.

ఇలా ఆలోచనల్లో ఉండగానే ఆఫీసుకు చేరు కున్నాను. మిత్రులంతా ఏమండీ! మీ పక్షులు ఏమంటున్నాయి? అన్నారు.

ఏం చెప్పాలో తెలీక నా సీటుకు వెళ్లి ఎగిరి పోయిన బంధాన్ని మనస్సులో బంధించి పనిలో మునిగిపోయాను.